కామయ్య

[కథానిక]

✽

= శ్రీ క్రొవ్విడి లక్ష్మన్న =

"పాపం, ఎంత గౌరవంగా బ్రతికినవాడికి యెలాంటి గతి పట్టిందీ! అబ్బ! పరాయి వాడికయినా వద్దు బాబూ యిటువంటి కష్టం! అసలు యిటువంటి పరిస్థితులు వాస్తవికంగా తటస్థిస్తాయని అనుకోలేదు సినీమాలలో చూడడమే తప్ప—" యీ మోస్తరుగా అనుకుంటున్నారు ఆవేళ సిటీక్లబ్బులో. సంగతి తెలుసుకుని నిశ్చేష్టుణ్ణి అయిపోయేను.

కామయ్యగారు హైస్కూల్లో తెలుగు మేష్టరు. ఆరీతిగా వచ్చే నలభైరాళ్లకీ ప్రయివేట్లవల్ల మరో పదిపాషాణాలు జమచేసి యెలాగో సంసారవారధి కడుతూ ఉండేవాడు. ఏడాదికి రెండు ఖద్దరుధోవతుల చాపులు, నాలుగు లాల్చీలు, రెండు తుండుగుడ్డలతో సరిపోయేది అతనికి. సంసారం చాలా గుట్టుగా జరిగిస్తూ ఉండడంవల్లనయితేనేం, తన సుగుణ సంపదవల్లనయితేనేం, సాటివారిలో 'ఓ' అనిపించుకున్నాడు యిన్నాళ్లూను. మూడో పది దాటిందో లేదోకాని మూడు యాభైలు గడిపినవాడికయినా వుండదు అతనికి ఉన్న చాకచక్యం, వ్యవహారజ్ఞానమున్నూ. ఎటువంటి మేష్టరుకయినా స్టూడెంట్లు పునర్నామకరణం చేసి పీఠిని పెట్టకమానరు. కాని కామయ్యగారికి మాత్రం ద్వితీయ నామకరణ మహోత్సవం జరగలేదు; సరికదా ఆయనంటే అందరికీ ఎంతో భక్తీ, గౌరవమున్నూ. ఛందస్సు చెప్పమని కొందరు, తమ వ్యాసాలు దిద్దిపెట్టమని యింకొందరు, కావ్యకళాచర్చలతో మరికొందరు— యథాభిరుచిగా ఆయనకి పనికలిగించి ఆయన సహాయంవల్ల కృతార్థులయేవారు. రసికతగూడా ఎరిగినవాడవడంవల్ల ఆయనకి తరుచుగా భావకవులతోటీ, అధివాస్తవికతావాదులతోటీ వాగ్వివాదాలు జరుగుతూ వచ్చినా, ఆ చర్చలవల్ల ఉభయపార్టీలకీ విజ్ఞానదోహదమే ఏర్పడేదికాని యీషణ్మాత్రమయినా విరోధభావం ఉండేదికాదు. అంచేత మావూళ్లో విద్యాసంస్థల సభలు అతని ఉపన్యాసం లేకుండా జరిగేవి కావు యెప్పుడూను.

అన్నివిధాలా అతనికి తగిన యిల్లాలు లింగమ్మగారు. కాపరానికి వచ్చిన యీ పది పన్నెండు యేళ్లనుంచీ ఆమె ఎవ్వరినీ పల్లెత్తుమాట అనిగాని, అనిపించుకునిగాని ఎరగదు. వాకట్లోది సహితం లింగమ్మగారి యింటిపని చేస్తేనేగాని యింకేపనీ ముట్టుకునేది కాదు. ఇక స్కూలుపిల్లలకి మాతృభక్తే! ఆదివారం మధ్యాహ్నాలు మేష్టరుగారింటికి వెళ్లినవాడు ఎవ్వడూ ఉప్పుపిండో, జంతికలో, పొంగరాలో నములుతూగాని విద్యావ్యాసంగం చేసేవాడు కాదు. ఆ ఉప్పుపిండిలో పడ్డ కరివేపాకు, కొబ్బరికోరు, జంతికల్లో జీలకర్రపాయ, పొంగరాల్లో పచ్చిమిరపకాయ తలుచుకుని లింగమ్మగారి పేరు ఎంతమంది చెప్పుకోలేదు! ఆ సందర్భంలో హోటేళ్లలో తాము డబ్బు తగలేస్తున్నామని ఎంతమంది విసుక్కోలేదు!

కాని యింతట్లోకే యుద్ధం వచ్చిపడింది. గొప్ప భాగ్యవంతు లనిపించుకున్నవాళ్లు కూడా "కాటకం" అంటూ తహతహలాడిపోయేరు. ఈ ఇస్కూలు మేష్టరు ఒక లెఖ్ఖా! రెండేళ్లనుంచీ మరీ దుర్భరమయిపోయినాయి ఆర్థికపరిస్థితులు. అప్పటికప్పుడే లింగమ్మగారి

కంటె,గట్టికడియాలు రెండుసార్లు బాంకుకు వెళ్లి ఎలాగో తిరిగివచ్చి, మళ్లీ మూడోమారు వెళ్లి యింక యింటి పట్టు చేరమని భీష్మించుకూర్చున్నాయి. నానాటికీ అప్పులపా లయిపోయినాడు బ్రాహ్మడు. మార్వాడీ వాళ్లు మన మేనమామకొడుకులా యేమిటి? భార్య మెడలో కట్టవలసిన పుస్తె బంగారం మెళ్లో కడతారు వాళ్లు. పొద్దస్తమానం లెక్కలు సరిచూచుకోవడమూ, రావలసిన బాకీలు రాబట్టుకోడానికి యత్నించవమున్నూ. అవి కాస్తా వసూలుకాకపోతే కోర్టుకెక్కిస్తారు. పైగా పాముపగ! చూస్తూఉండగా కామయ్య గారి కేసు విచారణకావడం, ఆరునెలలు శ్రీ కృష్ణజన్మస్థానప్రాప్తి లిఖితమయిపోవడమూ జరిగేయి. లింగమ్మ గారి చెవి నీ వార్త పడగానే శిలాప్రతిమ అయిపోయింది. యిటువంటి మనఃప్రవృత్తినేకాబోలు అశ్రువుల కందని విచారం అన్నాడు వర్డ్సువర్తు. రెండునిమిషాల వరకూ చైతన్యరాహిత్యమేనంటే నమ్మండి. తరవాత ఏడుపులూ, ఓదార్పులూ యథాక్రమంగా జరిగేయి. విద్యార్థులే తోడుపడ్డారు చాలావరకు; తలుచుకుంటే వాళ్లు చెయ్యలేనిది ఏముందికనక; కిష్కింధ!

ఎవ రెన్నివిధాల సాయపడితేనేం? ఆవుని గోలెండగ్గరకి తీసుకువెళ్లగలంకాని కుడితి త్రాగించ గలమా? లింగమ్మగారు నాటినుండీ గతం, ప్రస్తుతం తలుచుకుని ప్రాణాహుతులుకూడా పరిత్యజించింది. కంటికీ మంటికీ సంతతధారగా అశ్రుకణాలు రాలుస్తూ అశోకవృక్షంక్రింద సీతామ్మవారిలాగ కూర్చునేది. మంగళసూత్రం గళభాగాన్ని అలంకరించిందిమొదలు ఆమె పతిసేవ చేసుకునిగాని ఏ పనీ ముట్టుకునియెరగదు. అటువంటి మహాయిల్లాలికి భర్తృవదనావలోకనమే కరువైపోయింది. ఆయన యింట లేడు. బయట వారిని చూడాలంటే మూడుమైళ్లు ప్రయాస, పాదచారం చేసి రావాలి. అప్పుడయినా లభ్యముహూర్తం అరుణోదయాన్న అరఘంట, సూర్యాస్తమయాన అరఘంట మాత్రమే. ఇహ జెయిలుకావలివాళ్లయితే సాక్షాత్తూ యమకింకరులే. కర్ణకఠోరంగా 'ఖణే'ల్మని బయట గేటు యినుపతలుపుల చప్పుళ్లు ఆమెకి హృదయవిచ్ఛేదకంగా పరిణమించడం నిత్యానుభవ మయిపోయింది. అయినా అమాయకురాలు, పతివ్రత; తన భర్తనిర్దోషిత్వాన్ని త్రికరణశుద్ధిగా విశ్వసించింది. కాని కాలం కాలకూట విషస్వరూపంగా వచ్చి, పావకతుల్యమయిన పతిని పతితునిగా మార్చివేసింది. "మీ అప్పు కాదనడం లేదు. నెమ్మదిగా తీరుస్తాను. నా చేతుల్లో ఉన్నంత వరకూ ప్రయత్నంచేస్తూనేవున్నాను" అని వారు ఎన్నో విధాల బ్రతిమాలుకున్నారు. కాని వారి నిష్కల్మష్యం లోకం కనిపెట్టలేదు. న్యాయస్థానంలో అన్యాయం ప్రబలింది. ఔద్యోగికాంధులకు ధనమదాంధుల సంపర్కం కలిగితే యింకా పట్టపగ్గా లుంటాయా!

ఆమే, ఆ ఆరేళ్ల చిన్నపిల్లడూ అనునిత్యమూ అక్కడికి పోతూఉండడంవల్ల నేకాబోలు ఆ జెయిలు చాపరాళ్లు అరిగిపోయి అక్కడక్కడ గుంటలుపడ్డాయి. తీరా వచ్చినతరవాత, వచ్చినంతకాలమయినా, కాంతుని కాంతిరోచిస్సులలో వున్నట్టగపడదు. యింతలోకే చెవులు గింగురుమనేటట్లు గంట మ్రోగుతుంది. నీలియూనిఫారంసిపాయి, కోరమీసాలు ఎగదువ్వుకుంటూ నిప్పులుకక్కే కళ్లతో హెచ్చరిస్తాడు వెళ్లిపోమని; లాఠీతో గేటువైపు చూపిస్తాడు. క్షణకాలం జాలమయితే దైన్యానికి తోడు మానభంగం కూడా తప్పదు. భర్తనిర్దోషిత్వం, నిస్సహాయత, అవ్యాజానురాగం రిక్తచూపులోనే కనుపిస్తుంది. రాతిగుండెతో చాపరాతి మెట్లు దిగీదిగడంతోనే కాలమేఘాలు ఉరిమినట్టు ధ్వనించి జెయిలుగేటు సతీపతులను ఎడబాటు చేస్తుంది. ఎన్నోసార్లు, దినమల్లా ఆవేదనాభరితహృదయంతో బాధ పడిపడి, బహుఆతృతతో భర్తృసన్నిధి నాశించివచ్చి, తీరా వచ్చేక యింకా ఒక ఘంటకుగాని ఆమె లోనికి పోవీలుకాదని తెలుసుకుని నిట్టూర్చేది. అటువంటి సమయాల్లో బిక్కమొగంతో నదీతీరానికి పోయి, వంతెనపిట్టగోడమీద పిల్లడిని కూచోబెట్టి, నదీమతల్లిగర్భాన్న ప్రవహించే ప్రశాంతతరంగాలనీ, వాటిపై వస్తుసంచారభారంతో వయ్యారంగా తేలియాడుతూన్న తెప్పలనీ చూపించి ఎలాగో కాలయాపన చేయగోలేది ఆ మాతృహృదయం. కాని పిల్లవాని చూపుల్లోగాని, చేష్టల్లోగాని ఏమీ మార్పు కనపడకపోగా పొంగిపొరలే వేడికన్నీళ్లని పైటచెరగులో

దాచుకో ప్రయత్నించేది. ఎన్ని వింతవస్తువులు చూపించినా, ఎన్ని మరిపింతాలు పెట్టజూచినా, వచ్చీ రాని జ్ఞానం గల ఆ అర్భకుని స్మృతిపథంలో ఏమీ చలనం కనపడేది కాదు. ఎంతసేపూ తండ్రి దగ్గిర లేడనీ, తల్లి కటికదరిద్రం అనుభవిస్తున్నదనీ చెప్పరాని, చెప్పలేని ముద్ర పడిపోయినట్టుండేది ఆ బాల హృదయం. రాత్రింబవళ్లు ఆ అమాయికుడు తల్లి వొడిలో కూర్చుని, ముక్తాఫలాలవంటి ఆమె అశ్రుకణాలను చూచిచూచి, ఇంక భరించలేక యేమూలకో పోయి వెక్కి వెక్కి ఏడ్చి ఆ ఏడుపులోనే నిద్రపోయేవాడు. జ్ఞానం వచ్చినదగ్గరనుంచీ, ప్రాపంచికదురవస్థలన్నీ—ఆకలిదారిద్ర్యాలతోసహా—వంటబట్టిపోయేయి అతనికి. అతనికీ బాల్యావస్థలక్షణాలు పట్టినా, ఆ వుండవలసిన కోమలహృదయం, ఆ దరహాసచంద్రిక, ఆ తళుకు కన్నులూమాత్రం లుప్తమయినాయి అతనిలో.

రోజుకురోజూ దుర్భరగర్భవేదనగా పరిణమిస్తూన్న యీ పసిపాపని అవస్థాభేదాలు తల్లిదండ్రులు గుర్తించకపోలేదు. ఉదయసాయాహ్నాలు కలుసుకున్నప్పుడు వారి దీనదృష్టులే పరస్పరంగా హృదయకుహరాల్లో మానని గాయాలను కల్పించేది. పైకి మాత్రం ఏమాటా అనడానికి ధైర్యం చాలేది కాదు. ధీశాలి, శక్తిమంతుడు, మేధావి, భర్త; చీకటి కోణంలో ఆ అనారోగ్యపరిసరాలలో యినుపకమ్ముల వెనక యెందుకూ పనికిరాకుండా పోతున్నాడు. ఆ కృశాంగికోమలహృదయం భౌతికమానసిక బాధలతో క్రుంగిపోతోంది. బాలుని వదనారవిందం పాలిపోతోంది.

ఆనాడు కార్తికపౌర్ణమి. తెల్లవారుఝాము నుంచీ స్త్రీసమూహంతో నదీతీరం కిటకిటలాడుతోంది. స్నానాలు చేసుకుని, అరటిదొప్పలలో దీపాలు పెట్టి నదీమతల్లి గర్భమందుంచి తమతమ భక్త్యతిశయాన్ని నివేదించుకుంటున్నారు అందరూను. అవ్యక్తమధురంగా వుంది పాటలు పాడుతూన్న స్త్రీజనకంఠధ్వని. దేవీసాన్నిధ్యాన్ని బంగారుకలవమొగ్గలలాగ ప్రకాశిస్తున్నాయి దొప్పలలోని దీపికలు. కఱుకుదనపు శీతవాయువులు పెదిమలు కొఱుకుకుంటూ, భృంగసంగీతంతో విటసంచారాన్ని సాగిస్తున్నాయి. ఇదంతా చూసి, పెల్లుబ్బుగా వచ్చుచున్న దుఃఖాతిశయానికి బలియై, నిర్జీవమయిన యంత్రపు బొమ్మలాగ వెళుతోంది లింగమ్మగారు. దుక్కిదున్నినట్టు పాదాలు ధూళిధూసరితపూరా లయినాయి; చలిగాలికి పగుళ్లు వేసి మడమలు రక్తాలుకారుతున్నాయి; అతివేలమయిన శీతలానికి అవయవాలు తిమ్మిరి లెక్కేయి. అయినా ప్రకృతికీ, తనకూ సంబంధం లేనట్టే నడచిపోతోంది ఆమె; వెళ్లినకొద్దీ దూరానికి అంతు కనపడడం లేదు. అదుగో, అరుణోదయరాగంలో జెయిలు యినుపగేటు శ్మశానవాటికలో కుండపెంకు లాగ కనిపిస్తోంది.

సరిగా దరికిచేరుకునేసరికి తలుపులు తెరిచేరు. ఈమె ఒంటరిగా రావడం చూచి అక్కడ వున్న ముసలిజవాను ప్రశ్నార్థకంగా చూచేడు. రెండు చేతుల్లోనూ ముఖం దాచుకుని విసవిస వెళ్లిపోయింది శిశువిహీన. అప్పుడర్థమయిందతనికి తొలినాటి సాయంకాలం యీమె యెందుకు రాలేదో! కుప్పలాగ కూలబడి పోయేడు సెంట్రీ......"చచ్చి స్వర్గాన వున్నాడు. బ్రతికి యేం బావుకోవాలికనక?" అంటుంది మూర్ఖప్రపంచం. లోకం గ్రుడ్డిది, జ్ఞానరాహిత్యమయినదిన్ని. ఖర్మించాలక, పరిస్థితుల ఒత్తిడి కలిగినంతమాత్రాన తనని తృణీకరించి నిరసించి క్షూణపరిచింది అది—మొదట్లో తనవల్ల మేలుపొందికూడాను. నా అన్నవారు యెవ్వరూ లేక, సాటివారిలో తల యెత్తుకు తిరగలేక, అన్యాయమయిన అవమానాన్ని హృదయం చంపుకుని భరించుకువస్తూన్న ఆదంపతులకు ఆ చంటిపాపడి జిలిబిలిపలుకులే ఉపశమనవచనాలు. ప్రపంచమంతా పగబట్టినా తమ శిశువుమాత్రం నిష్కల్మషమయిన భక్తి అనురాగాలతో మెలుగుతున్నాడనే అనిర్వచనీయమయిన తుష్టభావమే వారికి ఒక పట్టుగొమ్మ, ఒక ఆశాలత, ఒక సౌఖ్యం, ఒక వెర్రిఆనందం! ఆ బాలుని ముఖం చూచి ప్రాతికూల్యాలనన్నింటినీ ప్రతిఘటించగలిగేవారు వారు. అతని గురించేకదూ అన్ని యిక్కట్లూ పడుతూన్నదీ? కాకపోతే యింత

అవమానం జరగకమునుపే యీ దుష్టలోకానికి దూరంగా తొలగిపోయేవారు. ఆ అభ్యాపనే లేకపోతే యింక బ్రతకడ మెందుకూ?

మర్నాడూ, మూడోనాడూ ఆమె రాలేదు. నాలుగోనాటి సాయంత్రం కామయ్యగారిని విడుదల చేసేరు. పేరు చెబితేనేగాని ఫలానా అని పోల్చుకోలేం. మోకాళ్లపైకి అడ్డదిడ్డంగా వున్న పంచెకట్టూ, బొత్తాములు లేని లాల్చీ, బూజుపట్టి చిందరవందరగా వున్న జుట్టూ ఎక్కడో మిన్నులుపడ్డ చోటు తదేకధ్యానంతో పరధ్యాన్నంగా చూసే ఆ వెర్రిచూపూ, అవకతవకనడక, గమనంలో తీవ్రతా—కావ్యరసామృతాన్ని కడుపారా త్రావించి, శిష్యులకు చెలిమికాడై శిష్టజనాగ్రగణ్యుడయి, విజ్ఞానప్రబోధం చేసిన ఆ మేస్టరుగారేనా యీయన? ఆ కామయ్యగారేనా?

గడపదగ్గర నిలుచుని చెయ్యి వేసేసరికి నిశ్శబ్దంగా, జాలిగా తెరుచుకుంది కవాటం. ఎలుగురాని డగ్గుత్తిక కంపస్వరం ప్రలపించింది. కిటికీలోంచి పడుతూన్న వెన్నెలకిరణాలు వెలవెలబారి ఆత్మచ్ఛాయతో నున్న అర్ధాంగిని అతనికి నివేదించేయి. ఆమెపై వొరిగి, ఆ నిస్తేజముఖాన్ని తిలకించి అతను అలాగే ఆమె ప్రక్కనే అనంతవాయువుల్లో ప్రాణవాయువులను లీనంచేసేడు.